సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 27 । జూన్ । 2025



నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. పాల్వంచ మండలంలో పర్యటించారు.

- 8లో ▸



వేధిస్తున్న వైద్యుల కొరత

పిట్లం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత, మౌలిక వసతులు అంతంతగానే ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /22.5

వాతావరణం

ఉదయం చల్లని ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

'సాగర్'లోకి ఇన్‌ఫ్లో



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు గురువారం తెలిపారు. క్యాచ్‌మెంట్ ఏరియాతోపాటు ఎగువన కుండపోతగా కురిసిన వర్షానికి వరద వస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు)కాగా.. ప్రస్తుతం 1392 అడుగుల (5.2 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 1,025 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రేపు జాబ్ మేళా

కామారెడ్డి క్రైం: ప్రైవేట్ రంగంలో యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 28వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో 20 పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో ఏదైనా డిగ్రీ, పీజీ, ఎంబీఏ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు అన్ని సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరుకావాలని, మిగతా వివరాల కోసం 70975 25933, 76719 74009 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రమశిక్షణతో మెలగాలి



కామారెడ్డి అర్బన్: క్రమశిక్షణతో మెలగాలని విద్యార్థులకు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి దయానంద్ సూచించారు. పట్టణ పరిధిలోని దేవునిపల్లి వాసవీకాలనీలో ఉన్న మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం కళాశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందజేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట ఆర్ఎల్‌సీ కిరణ్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

సాహస అవార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: టెన్సింగ్ నార్కే నేషనల్ అడ్వెంచర్ అవార్డు–2024 అవార్డు కోసం సాహస కృత్యాలు చేసిన వారి నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా క్రీడలు, యువజన అధికారి కేఎస్ జగన్నాథన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో భూమి, ఆకాశం, సముద్రంలో సాహస కృత్యాలు చేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు..

కామారెడ్డి అర్బన్: జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ద్వారా ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమాధికారి పి వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కులాల్లో గ్రూప్–1లో ఐదు సీట్లు, గ్రూప్–2లో పది సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల వారు జూలై 5వ తేదీలోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



బాన్సువాడ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బాన్సువాడ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. యువత పెడదారి పట్టకుండా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఆల్కహాల్, సిగరేట్, బీడీ, గుట్కా వంటివి సేవించడం కారణంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీనారాయణమూర్తి, మోహన్‌రెడ్డి, భూషణ్‌రెడ్డి, రమాకాంత్, ఆనంద్, హైమద్, అజీం, హర్షద్, కోర్టు సిబ్బంది, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



ఇటీవల మరమ్మతులు చేపట్టిన చోట లిఫ్ట్‌ఇరిగేషన్ పైప్‌కు మళ్లీ ఏర్పడిన లీకేజీ

పంట పొలాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో బాన్సువాడ మండలం చింతల్ నాగారం శివార్లలో మంజీర నది ప్రాంతంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం రైతులకు కొత్త తలనొప్పి తెచ్చిపెడుతోంది. పంటలకు నీరందడం విషయాన్ని పక్కన పెడితే పైప్‌లైన్ లీకేజీల కారణంగా వ్యవసాయ భూముల్లోకి నీరు చేరి నిలుస్తోంది. రైతులే ఒక కమిటీగా ఏర్పడి నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పైప్‌లైన్ మాటిమాటికి ధ్వంసమై లీకేజీలు ఏర్పడుతున్నాయి.

నీరు వృథా రైతు వ్యథ

- ఎత్తిపోతల పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు
- బురదనీటితో పొలాలు..
- పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్న రైతులు
- కొత్త పైపులైన్ వేస్తేనే శాశ్వత పరిష్కారం



పంట పొలాల్లోకి చేరిన నీరు

బాన్సువాడ : మంజీర నది ప్రాంతంలో ఉన్న ఎత్తిపోతల పైపులైన్ లీకేజీలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాన్సువాడ, తాడ్కోల్, చింతల్‌నాగారం శివార్లలోని పంట పొలాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో మంజీర నది ప్రాంతంలో ఎత్తి పోతల పథకం ఏర్పాటు చేశారు. ఈ ఎత్తి పోతల పథకం కింద సుమారు 600 ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, నిర్వహణ బాధ్యత కోసం రైతులే ఓ కమిటీని ఏర్పాటు చేసి పైపులైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మతులు చేయిస్తారు. పంటలు చేతికొచ్చిన తర్వాత ఎకరానికి 70 కిలోల ధాన్యం బస్తాను కమిటీకి చెల్లిస్తారు. ఇలా వసూలైన ధాన్యాన్ని విక్రయించి మోటార్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీలు, కాలువల మరమ్మతులు చేయిస్తారు. ఎత్తిపోతల పైపులైన్ వేసి చాలా ఏళ్లు కావడంతో పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. నీరు వృథాగా పోతున్న ప్రాంతంలో భారీగా జమ్ము మొలవడమే కాకుండా నీరు పొలాల్లోకి చేరుతోంది. దీంతో పొలాలు జాలుపట్టి పంటలు సరిగా పండడం లేదు. సుమారు 200 ఎకరాల్లో ఎప్పుడూ నీరు ఉంటుండడంతో పొలాలు ఆరడం లేదు. పంట కోతకు వచ్చిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పైపుల కింద బండరాళ్లు ఉండడంతోనే..

ఎత్తి పోతల పథకం నుంచి వేసిన పైపులైన్ కింద పెద్ద పెద్ద బండరాళ్లు ఉండడంతో నీటి ప్రవాహానికి పైపులకు బండరాళ్లు గుచ్చుకుని రంధ్రాలు పడుతున్నాయి. ఇలా పగుళ్ల కారణంగా లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. లీకేజీల మరమ్మతులు చేపట్టినప్పటికీ పైప్‌లైన్ కింద బండరాళ్లు ఉండడంతో మళ్లీ పైపులు పగిలిపోతున్నాయి. పంటలు కోత కొచ్చిన సమయంలో వరి కోత మిషన్‌లు దిగబడుతుండడంతో మిషన్ యజమానులు ముందుకు రావడం లేదని రైతులు అంటున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వృథా నీరు పారడంతో దమ్ము చేయాలన్నా, నాట్లు వేయలన్నా ఇబ్బందులు పడుతున్నారు. నారు నీటిలో మునిగిపోతోంది. పంట దిగుబడులు రావడం లేదు. సమస్య పరిష్కారానికి ఎత్తిపోతల కమిటీ చేస్తున్న అన్ని ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. అధికారులు స్పందించి ఎత్తి పోతల పథకం నుంచి చింతల్ నాగారం రోడ్డు వరకు కొత్త పైపులైన్ వేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని రైతులు అంటున్నారు.

“ వృథా నీటితో ఇబ్బంది పడుతున్నాం



ఎత్తిపోతల పథకం పైపులైన్ లీకేజీల కారణంగా నీరు వృథాగా పోతోంది. వరద ఎక్కువై పొలాల మీదుగా పారుతుండడంతో పంట పెద్దగా రాకపోగా పండిన కొద్ది పంటను కూడా కోసుకోలేకపోతున్నాం. మళ్లీ వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. పొడిదుక్కి దున్నలేదు. దమ్ము చేయాలన్నా నీరు ఎక్కువగా ఉండడంతో గడ్డి పైకి తేలుతుంది. వృథా నీటితో చాలా ఇబ్బందులు పడుతున్నాం. – గుల్లెపల్లి గంగాధర్, రైతు, బాన్సువాడ

మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ తనిఖీ

- మెడికల్ కళాశాల, జీజీహెచ్‌ను సందర్శించిన బృందం
- మొక్కుబడిగా ముగించారని విమర్శలు



మెడికల్ కళాశాలలో వివరాలను తెలుసుకుంటున్న డీపీహెచ్ రవీందర్‌నాయక్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెడికల్ కాలేజీ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) బృందం గురువారం తనిఖీ చేపట్టింది. కమిటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) రవీందర్ నాయక్, సభ్యులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్‌తో పాటు అధికారులు మధ్యాహ్నం మెడికల్ కళాశాలను తనిఖీ చేశారు. మెడికల్ కళాశాల, హాస్టల్ భవనాల పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి అప్పగించాలని ఇంజినీర్ అధికారులకు సూచించారు. నీటి సమస్య, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలు, పరికరాలు, సిబ్బంది ఖాళీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదనంగా మరో 100 పడకలతో హాస్టల్ నూతన భవనం కావాలని కామారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్ డీపీహెచ్‌ను కోరారు.

గైర్హాజరైన సూపరింటెండెంట్

ఎంసీఎంసీ బృందం తనిఖీ సమయంలో జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదా గైర్హాజయ్యారు. ఉదయం హాజరు రిజిస్టర్‌లో సంతకం చేసిన ఆమె మధ్యాహ్నం వెళ్లిపోయారు. ఆరోగ్యశ్రీ నిధులు హెచ్‌డీఎస్ కమిటీ అనుమతి లేకుండా ఇష్టానుసారంగా వినియోగించారని, ఈ వ్యవహారంలో కలెక్టర్ సూపరిండెంట్‌పై బుధవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తనిఖీ సమయంలో ఉంటే ఉన్నతాధికారులకు విషయం తెలిసిపోతుందనే ఆమె మధ్యాహ్నం వెళ్లిపోయారని ఆస్పత్రి సిబ్బంది, కొంత మంది వైద్యులు గుసగుసలాడారు.

40 నిమిషాల్లోనే..

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి చేరుకున్న బృందం.. సాయంత్రం 4.20 నుంచి 4.35 మధ్య తనిఖీ చేసింది. ల్యాబ్, ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం సూపరింటెంటెండ్ చాంబర్‌లో వైద్యాధికారులతో 4.38 నిమిషాలకు సమీక్ష సమావేశాన్ని ప్రారంభించారు. 5 గంటలకు బయటకు వచ్చిన బృందం సభ్యులు 5 గంటల 6 నిమిషాలకు ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారు. రోగులతో మాట్లాడకపోవడం, ఆస్పత్రి ఆవరణను పరిశీలించకపోవడంతో మొక్కుబడిగా తనిఖీ ముగించారని పలువురు విమర్శించారు. అదనపు కలెక్టర్ విక్టర్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, టీఎంఎస్ఐడీసీ నిజామాబాద్ ఈఈ కుమార్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, వైద్యులు ఉన్నారు.

ఇసుక పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు

బిచ్కుంద(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లబ్ధిదారులకు ఇసుక ఇవ్వకుండా పక్కదారిపట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. తహసీల్, మున్సిపల్ కార్యాలయాలను గురువారం ఆమె సందర్శించారు. సబ్ కలెక్టర్ వచ్చిన విషయం తెలుసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. 10 ట్రాక్టర్ల ఇసుకకు ఒకేసారి పర్మిట్లు ఇస్తున్నారని, స్థలం లేక రెండు, మూడు ట్రాక్టర్ల ఇసుక తాము వేసుకుంటుండగా, మిగతా ఇసుకను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి కమిషనర్ ఖయ్యూంను ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని సబ్ కలెక్టర్ ప్రశ్నించగా.. ఆరుగురు సిబ్బంది కొత్తగా విధుల్లో చేరారని, వార్డు అధికారులతోపాటు మరి కొంత మంది సిబ్బంది అవసరం ఉందని కమిషనర్ సమాధానమిచ్చారు. సిబ్బంది నియామకంతోపాటు ఇతర అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సబ్ కలెక్టర్ అన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో అసంతృప్తి

- పార్టీకి సీడీసీ చైర్మన్ ఇర్షాద్ రాజీనామా
- ఎమ్మెల్యే పీఏల పెత్తనంపై మండిపాటు



ఇర్షాదుద్దీన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ మండలానికి చెందిన సీడీసీ చైర్మన్ మహ్మద్ ఇర్షాదుద్దీన్ కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన పీసీసీ, డీసీసీ అధ్యక్షులకు రాజీనామా లేఖలు పంపించారు. కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పని చేస్తూ, ఎమ్మెల్యేగా మదన్‌మోహన్‌రావు గెలుపు కోసం కష్టపడ్డానని లేఖలో పేర్కొన్నారు. గత కొంత కాలంగా తనలాంటి నాయకులను అవమానిస్తూ, విస్మరిస్తూ, పార్టీ ద్రోహులకు కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే పీఏల పెత్తనంతో విసిగిపోయానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షబ్బీర్‌అలీని గానీ, మరే ఇతర నాయకులను గానీ కలిస్తే చాలు తమ దగ్గరకు రావొద్దని ఆంక్షలు పెడుతున్నారని, వాట్సాప్ గ్రూప్‌ల నుంచి తొలగించి అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఏల వ్యవహారాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని లేఖలో పేర్కొన్నారు.

అప్పట్లో రామారెడ్డి మండల నేతలు

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రామారెడ్డి మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు అప్పట్లో పీఏల పెత్తనంపై ఆరోపణలు చేశారు. కొందరు నాయకులు ఇప్పటికీ ఎమ్మెల్యేకు దూరంగానే ఉంటున్నారు. తాజాగా సదాశివనగర్ మండలానికి చెందిన సీడీసీ చైర్మన్ ఇర్షాదుద్దీన్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడం చర్చనీయాంశమైంది.

తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతుభరోసా

- కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

మాచారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిని, తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ.9వేలకోట్ల రైతు భరోసా ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మండల కేంద్రంలోని శివబాలాజీ ఫంక్షన్ హాలులో గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ మురుగన్, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, పరిశీలకులు కత్తి వెంకటస్వామి, సత్యనారాయణగౌడ్, వేణుగోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. పేదల కోసం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని, ధనికులు తినే సన్న బియ్యం పేదలకు అందించి వారి కడుపు నింపుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. బీజేపీ రాష్టానికి చేసిందేమీ లేదని షబ్బీర్ అలీ ఘాటుగా విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టి అధికారం లోకి రావాలని చూస్తోందన్నారు. చిన్న చిన్న గొడవలు పక్కన పెట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త పాత నాయకులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

కులగణన దేశానికి ఆదర్శం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ అన్నారు. రేవంత్‌రెడ్డి దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్‌గా చేసి చూపించారని అన్నారు. ఎంపీ సురేశ్ షెట్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ప్రజా సేవే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అనుబంధ సంఘాల మండలాల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం ఉద్యమించాలి

- మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, అధికారులు, విద్యార్థులు

కామారెడ్డి క్రైం: డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత ఉద్యమించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కామారెడ్డిలో గురువారం సంక్షేమ శాఖ, పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, స్థానికులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. చర్చి గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కళాభారతి ఆడిటోరియం వరకు ఉత్సాహంగా కొనసాగింది. అనంతరం కళాభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత చెడు అలవాట్లకు మొదటి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ చాలా కీలకమన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్జి వరప్రసాద్ అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్ కోసం శ్రమించాలన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. మత్తు పదార్థాలు సేవించే వారి వివరాలను తమ దృష్టికి తీసుకునిరావాలన్నారు. 1908, 1933, 1446 టోల్ ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

1908కి సమాచారం ఇవ్వాలి

మత్తు పదార్థాలు సేవించడం కారణంగా చాలామంది విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. 'డ్రగ్స్ వాడము – ఇతరులను వాడనివ్వము' అనే నినాదంతో యువత ముందుకు నడవాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల సమాచారం తెలిస్తే 1908 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి నాగరాణి, అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్డీవో వీణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, డీఈవో రాజు, ఉద్యోగులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పసుపు బోర్డు కేంద్రం ఇచ్చిన బహుమతి

- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి
- ఎంపీ అర్వింద్ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది
- నిజామాబాద్ జిల్లా రైతు ఉద్యమాలకు కేంద్రబిందువు
- అమిత్ షా సభను జయప్రదం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సుభాష్‌నగర్ : పసుపు బోర్డు ఏర్పాటు జిల్లా రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన బహుమతి అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఎమర్జెన్సీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎంపీ అర్వింద్ ధర్మపురితో కలిసి గురువారం ఆయన వీక్షించారు. అనంతరం విలేకరులతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పసుపు బోర్డు కావాలనే 40 ఏళ్ల రైతుల ఆకాంక్ష, అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా కేంద్రం ప్రకటించిందని, ఎంపీ అర్వింద్ కృషితో రాష్ట్ర, జాతీయపార్టీ నిర్ణయం, ప్రధాని మోదీ ఆశీస్సులతో పసుపు బోర్డు ఏర్పడిందన్నారు. పసుపు బోర్డు తమ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఇతర రాష్ట్రాలు అడిగాయని, మోదీ చివరకు నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా జిల్లాకు చెందిన రైతుబిడ్డనే నియమించారన్నారు. ఈనెల 29న జాతీయ పసుపు బోర్డు కార్యాలయం పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చనుందన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా రైతులు సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం తర్వాత బోర్డు లోగోను అమిత్ షా ఆవిష్కరిస్తారని తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని కూడా షా ఆవిష్కరిస్తారని తెలిపారు.

రైతు సమ్మేళనానికి తరలిరావాలి

కేంద్ర హోంమంత్రి అమిత్ షా పసుపు బోర్డు కేంద్ర కార్యాలయం ప్రారంభించిన తర్వాత పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించే రైతు సమ్మేళన బహిరంగ సభకు హాజరవుతారని, రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పిలుపునిచ్చారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మోక్షం

- 40 ఏళ్లుగా అవస్థలు పడ్డ గ్రామస్తులు
- బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.కోటి 30 లక్షలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఇరు గ్రామాల ప్రజలు


బీటీ రోడ్డుగా మారనున్న వజ్జపల్లి, ఉత్తనూర్ రోడ్డు ఇదే

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): ఒకప్పుడు రోడ్డు వెంబడి నడవాలంటే ప్రజలు నరకయాతన అనుభవించారు. ఎన్నికల్లోనే ఈ రోడ్డు గురించి చర్చ జరిగేది.. ఆ తర్వాత ఎన్నికల్లో గెలిచిన తర్వాత మర్చిపోయేవారు. గత 40 ఏళ్లుగా మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని ఇరు గ్రామాల ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందిస్తూ వచ్చారు. అయినా సమస్య తీరలేదు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కొన్ని రోజులుగా విన్నపాలు అందిస్తూ వచ్చారు. గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే స్పందించి మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చడానికి ఎన్ని నిధులు అవసరపడతాయో సంబంధిత అధికారులను ఆదేశించి నివేదికను తెప్పించుకున్నారు. మండలంలోని వజ్జపల్లి, ఉత్తనూర్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.కోటి 30 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులకు ఇటీవల ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గతంలో ఈ రోడ్డు వెంబడి పాదచారులు నడవాలంటే ఇబ్బందికరంగా ఉండేది. తరచూ ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడడంతో గాయాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇరు గ్రామాలకు దూర భారం తగ్గనుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



గత పాలకులు బీటీ రోడ్డు నిర్మిస్తామని ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లు దండుకుంటూ అధికారంలోకి రాగానే ఆ రోడ్డు మాట పక్కన పెట్టేవారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలిచిన మదన్మోహన్రావు గత ఎన్నికల్లో రోడ్డు నిర్మాణం చేయిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాడు. ఎమ్మెల్యేకు ప్రజలు రుణపడి ఉంటారు. రోడ్డు నిర్మాణంతో ఎన్నో ఏళ్ల కల నెరవేరింది

– హరీష్ రావు, వజ్జపల్లి

ఎన్నికలప్పుడే గుర్తుకు వచ్చేది



ఎన్నికలు రాగానే ప్రచారానికి వచ్చే ప్రజాప్రతినిధులకు మా రోడ్డు గుర్తుకు వచ్చేది. మేము గెలవగానే రోడ్డును బాగు చేయిస్తాం అంటూ మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకునేవారు. ఆ తర్వాత రోడ్డు మాటే మర్చిపోయేవారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యేగా గెలిచిన మదన్ మోహన్ రావు ప్రత్యేక దష్టి సారించి రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయించారు.

– కలిగోట స్వామి, వజ్జపల్లి

క్లుప్తంగా

సామాజిక అంశాలపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం మహిళా సంఘాలకు సామాజిక అంశాలపై ఎంపీడీవో నరేష్ అవగాహన కల్పించారు. వన మహోత్సం, సీజనల్ వ్యాధులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పథకం అమలు తదితర విషయాల గురించి వివరించారు. అలాగే సంఘాల బలోపేతం, సభ్యుల ఆదాయ వ్యయాలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని, సంఘాల లావాదేవీలు ఆడిట్ చేయించాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షులు సులోచన, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీవో మలహరి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ స్లాబ్ పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ స్లాబ్ పనులను హౌసింగ్ డీఈఈ సుభాష్, నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. నిబంధనల మేరకు స్లాబ్ పనులు చేపట్టేలా కాంట్రాక్టర్కు సూచనలు చేశారు.క్రమం తప్పకుండా ప్రతిరోజూ స్లాబ్ క్యూరింగ్ పనులు చేపట్టాలని వారు సూచించారు.హౌసింగ్ ఏఈ సందీప్ ఉన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

నస్రుల్లాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం కిసాన్ పథకం కింద రైతులకు అందించే పెట్టుబడి సహాయం కోసం రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాలని ఏఈవో గ్రీష్మ అన్నారు. అందులో భాగంగా మిర్జాపూర్ క్లస్టర్కు సంబంధించి 34 మంది చేసుకోలేదని తెలిపారు. ఈసందర్భంగా గురువారం కామిశెట్టిపల్లిలో ఫేసియల్ యాప్ ద్వారా కేవైసీ చేశామన్నారు. డబ్బులు పడుతూ కేవైసీ చేసుకోని వారు ఉన్నా కూడా తప్పకుండా ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు.

'పద్మశాలి' కార్యవర్గం ఎన్నిక

బీబీపేట: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుమ్మ మచ్చేందర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా బాలే సహదేవ్, ఉపాధ్యక్షుడిగా శంకర్, ఉప కార్యదర్శిగా అల్వాల నర్సింలు, కార్యవర్గ సభ్యులుగా రాజేందర్, అంకాలం నరేందర్, గణేష్, వేణు, భాస్కర్, లక్ష్మీనారాయణ, మహిళ సభ్యులుగా జమున, ఉషశ్రీ, లావణ్య ఎన్నికయ్యారు. నేతలు చందుపట్ల విఠల్, జనార్దన్, పురుషోత్తం, సందీప్, రాజు, కిష్టయ్య, రామచంద్రం పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుకు అభినందనలు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక పీహెచ్సీలో బుధవారం రాత్రి కష్టతరమైన డెలివరీ చేసిన స్టాఫ్ నర్సు ప్రతిభను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. వివరాలు.. సురాయిపల్లి తండాకు చెందిన గర్భవతిని బుధవారం రాత్రి పీహెచ్సీకి తీసుకొచ్చారు. డ్యూటీలో ఉన్న నర్సు గర్భవతిని పరీక్షించగా.. గర్భంలో మాయ ఎక్కువగా ఉంది.. బిడ్డ మెడచుట్టూ బొడ్డుతాడు(పేగు) చుట్టుకొని ఉన్నట్లు గమనించారు. అయినా సాహసం చేసి స్టాఫ్ నర్సు ప్రతిభ నార్మల్ డెలివరీ చేసినట్లు పీహెచ్సీ వైద్యులు రాంబాయి తెలిపారు. బిడ్డ, తల్లి ఆరోగ్యంగా ఉన్నారు.

సెర్ప్లో బదిలీలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో బదిలీలు జరిగాయి. ఏపీడీగా పనిచేస్తున్న మురళీకృష్ణ హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి విజయలక్ష్మి వచ్చారు. అలాగే డీపీఎంలు సుధాకర్ సంగారెడ్డి జిల్లాకు, రమేశ్బాబు జనగామ జిల్లాకు, రవీందర్రావ్ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా నిజామాబాద్ నుంచి నూకల శ్రీనివాస్, మేకల సాయిలు, సిద్దిపేట నుంచి జి.రాజయ్య జిల్లాకు వస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి


షబ్బీర్ అలీతో వీర హనుమాన్ వేంకటేశ్వర ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు

మాచారెడ్డి: వీర హనుమాన్ వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మండలంలోని వీర హనుమాన్ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా షబ్బీర్ అలీ, ఏఐసీసీ ఇన్చార్జి విశ్వనాథన్ మురుగన్, ఎంపీ సురేష్ షెట్కార్ హాజరయ్యారు. నూతన కార్యవర్గంతో దేవాదాయ శాఖ పరిశీలకులు కమల ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్గా శనిశెట్టి రాజమౌళి, డైరెక్టర్లుగా రాజేశం, శాంతి, సత్యనారాయణ, దేవయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఆలయాన్ని అభివృద్ధి చేసే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. మాజీ ఎంపీపీ నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నౌసీలాల్, నాయకులు లక్ష్మారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, గణేష్ నాయక్, కమలాకర్రెడ్డి, ఈవో ప్రభు సిబ్బంది ఉన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బాన్సువాడ/తాడ్వాయి/ఎల్లారెడ్డి రూరల్: మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పలితాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బాన్సువాడ విద్యార్థి నిఖిల్గౌడ్, తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి పాఠశాలకు చెందిన కుమ్మరి తరణి, ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల జెడ్పీ పాఠశాల విద్యార్థిని సౌమ్య ప్రతిభా కనబర్చడంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. గురువారం కామారెడ్డిలో వీరికి సర్టిఫికెట్లు, మెమొంటో అందజేశారు.

హోంగార్డులకు రెయిన్ కోటుల పంపిణీ



కామారెడ్డి క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖలో పని చేస్తున్న హోంగార్డులకు హోంగార్డుల విభాగం అదనపు డీజీపీ స్వాతి లక్రా ఆధ్వర్యంలో రెయిన్కోటులను పంపిణీ చేస్తున్నట్లు అదనపు ఎస్పీ నరసింహా రెడ్డి తెలిపారు. జిల్లాలోని హోంగార్డులకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రెయిన్ కోటులను ఏఎస్పీ అందజేశారు. ఏఆర్ సీఐ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ఎస్హెచ్వోగా బాధ్యతల స్వీకరణ



కామారెడ్డి క్రైం: పట్టణ ఎస్హెచ్వోగా బదిలీపై వచ్చి న నరహరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ యేడాదిన్నర పాటు పని చేసిన సీఐ చంద్రశేఖర్ రెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా డీజీపీ కార్యాలయానికి వెళ్లగా.. ఆయన స్థానంలో నరహరి ఇక్కడకు వచ్చారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కామారెడ్డి టౌన్: మూడు నెలల జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల జీపీ వర్కర్స్ యూనియన్ నేత రమేశ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముందు యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలన్నారు. జీవో– 51 రద్దు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు.

క్రైం కార్నర్

బైక్ను ఢీకొన్న బస్సు : ఒకరి మృతి


కోటార్మూర్లో బైక్ను ఢీకొన్న బస్సు

ఆర్మూర్టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్లో బైక్ను ఓ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోటార్మూర్కు చెందిన మామిడి మహేష్ (38) గురువారం ఉదయం తన బైక్పై తన భార్య లావణ్యను మహిళా ప్రాంగణ సమీపంలో ఓ పనికి దించి ఇంటికి బయలుదేరాడు. కాగ కోటార్మూర్లోని తిరుపతి ఆస్పత్రి వద్ద అతడి బైక్ను జగిత్యాల డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేష్కు తీవ్రమైన గాయాలవ్వడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హెచ్వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

పాముకాటుతో ఒకరు..


భుక్యా కపుర్యా (ఫైల్)

కామారెడ్డి క్రైం: గుడిసెలో నిద్రిస్తుండగా పాము కాటు వేయడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన భుక్యా కపుర్యా (30) వ్యవసాయం, కూలీ పనులు చేసుకునేవాడు. అతనికి గతంలో వివాహం జరుగగా భార్యతో విడాకులు అయ్యాయి. అతడు బుధవారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రించాడు. వేకువజామున మెలకువ వచ్చి చూసుకోగా పాము కాటుకు గురైనట్లు గుర్తించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం 6 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అర్ధరాత్రి విషసర్పం కాటు వేసి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

భార్యపై హత్యాయత్నం.. భర్తకు నాలుగేళ్ల జైలు

నందిపేట్(ఆర్మూర్): దంపతుల మధ్య జరిగిన గొడవలో భార్యను హత్య చేయడానికి యత్నించిన భర్తకు ఆర్మూర్ కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా.. 2024లో నందిపేట మండలంలోని కొల్పూర్ గ్రామంలో ఖాసిం భాష అనే వ్యక్తి తన భార్యతో గొడవపడగా, ఆమెను హత్య చేసేందుకు ప్రయత్నం చేశాడు. దీంతో అతడి భార్య వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి, నిందితుడిని అరెస్టు చేశారు. ఆర్మూర్ సబ్ కోర్టులో హాజరుపర్చగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడికి 4 సంవత్సరాల జైలు శిక్షతోపాటు, రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

డ్రంకన్డ్రైవ్ కేసులో ఇద్దరికి..

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం పోలీసులు డ్రంకన్డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా సారంగాపూర్కు చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో అతడిని గురువారం నిజామాబాద్ కోర్టులో పోలీసులు హాజరు పర్చారు. జడ్జి అతడికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ధర్పల్లి: ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద ఈనెల 24న పోలీసులు డ్రంకన్డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ధర్పల్లికి చెందిన ఒక వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు అతడిని గురువారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి అతడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా: ఐదుగురికి గాయాలు



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ రహదారిపై కారు బోల్తా పడటంతో డ్రైవర్తోపాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ నగరానికి చెందిన నలుగురు వ్యక్తులు బుధవారం కారులో సాటాపూర్లోని ఓ ఫంక్షన్హాల్లో జరిగిన కార్యక్రమానికి వచ్చారు. కార్యక్రమం అనంతరం అదే రాత్రి తిరిగి నగరానికి బయలుదేరారు. సాటాపూర్ రహదారిపై వారి కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కన గల గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో కారు డ్రైవర్తోపాటు కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురికి గాయాలయ్యాయి. డ్రైవర్ సర్ఫరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

పేకాడుతున్న పది మంది అరెస్టు

బాన్సువాడ: బీర్కూర్ మంజీర ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10మందిని అరెస్ట్ చేసినట్లు బీర్కూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి 8 సెల్ఫోన్లు, ఏడు బైక్లు సీజ్ చేసి, రూ.8300 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

దాబా, హోటళ్లపై పోలీసుల దాడులు

నిజాంసాగర్(జుక్కల్): నాందేడ్-సంగారెడ్డి 161 జాతీయ రహదారి వెంబడి ఉన్న దాబాలు, రెస్టారెంట్లపై బుధవారం అర్ధ రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ మండలాల్లోని జాతీయ రహదారి పక్కన ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సిట్టింగులు, విక్రయాలు జరుపుతున్న దాబాలపై దాడి చేసి, అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్య సిట్టింగులు నిర్వహిస్తున్న దాబా నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

అసభ్యపదజాలంతో దూషణ.. కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాష్ ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాష్ వద్దకు ఇటీవల లింగంపేట మండలం ఐలాపూర్కు చెందిన బేగరి సాయిలు అనే వ్యక్తి వచ్చి కల్యాణలక్ష్మి పథకానికి సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయాలని వచ్చాడు. పత్రాలు సరిగా లేవని ఎంపీడీవో సంతకాలు పెట్టేందుకు నిరాకరించాడు. దీంతో సాయిలు అసభ్య పదజాలంతో దూషించాడు. ఎంపీడీవో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ప్రచారం ఇక్కడి నుంచే ప్రారంభం

మీకు తెలుసా?


ఆలయంలోని అమ్మవారం



శ్రీరాంపూర్లో చిలుకల చిన్నమ్మ ఆలయం

బాల్కొండ: బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు ఏ పార్టీ వారైనా ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని శ్రీరాంపూర్గల చిలుకల చిన్నమ్మ ఆలయం నుంచే ప్రారంభిస్తారు. ఈ అమ్మ ఆలయం నుంచే ప్రచారం ప్రారంభించడం సెంట్మెంట్గా భావిస్తారు.

- శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్లో ముంపునకు గురైన శ్రీరాంపూర్ గ్రామం అదే పేరుతో 1963లో బాల్కొండ మండలంలో నూతన గ్రామంగా వెలిసింది. ముంపు గ్రామం నుంచి చిలుకల చిన్నమ్మను తీసుకువచ్చి ఇక్కడ స్థాపించారు.
- భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతగా ఈ ఆలయంలోని చిలుకల చిన్నమ్మ ప్రసిద్ధి చెందింది.
- ప్రతి ఆదివారం, గురువారం ఆలయం వద్ద సుదూర ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.
- ప్రతి సంవత్సరం మాఘ ఆమావాస్య రోజున ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.
- చిలుకల చిన్నమ్మ పేరున గ్రామాల్లో చిన్నయ్య, చిన్నమ్మ నామకరణం చేసుకుంటారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి


భవానిపేట తండాలో సేవాలాల్ జగదాంబ ఆలయాన్ని ప్రారంభిస్తున్న కేవీఆర్

మాచారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం పాల్వంచ మండలంలోని భవానిపేట్ తండా, సింగరాయపల్లి, ఇసాయిపేట, మంథని దేవునిపల్లి, ఎల్పుగొండ, వాడి గ్రామాల్లో పర్యటించి తన సొంత నిధులతో నిర్మించిన కుల సంఘ భవనాలు, ఆలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోసు అనిల్, నాయకులు పండ్ల ప్రవీణ్, సురేష్, వెంకటరెడ్డి, బాలరాజు, నరసింహాచారి, శ్రీనివాసాచారి, నరేష్, నారాయణ, బాల్ నర్సు ఉన్నారు.

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్బాస్ ఖాన్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆర్బాస్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈవో దేవీసింగ్కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రయివేట్ పాఠశాల్లో ఇష్టానుసారంగా పుస్తకాలు, టై, బెల్టుతో వ్యాపారం చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సరైన అర్హత లేని వారితో విద్యా బోధన చేపిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఆడుకోవడానికి సరైన ఆట స్థలం కూడా లేదన్నారు. అధికారులు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నేతలు శేఖర్, ప్రసన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీకి సేవ చేసిన వారికి తగిన గుర్తింపు'


ఇంద్రకరణ్ రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

భిక్కనూరు: కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు సేవ చేసిన వారికి తగిన గుర్తింపును ఇచ్చి పదవులను కట్టబెడుతుందని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. గురువారం పీసీసీ కార్యదర్శిగా నియమితులైన ఇంద్రకరణ్రెడ్డిని ఆయన భిక్కనూరు సమీపంలోని ఫామ్హౌస్లో సన్మానించారు. ఈ సందర్భంగా షెట్కార్ మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, యూత్ కాంగ్రెస్ నేత ఇంతియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్రెడ్డి, నేతలు బల్యాల సుదర్శన్, కుంట లింగారెడ్డి, భీంరెడ్డి, బాగారెడ్డి పాల్గొన్నారు.

'క్రమశిక్షణతో విజయం'

భిక్కనూరు: చిన్నతనం నుంచే క్రమశిక్షణతో ముందుకు సాగితేనే విజయం వరిస్తుందని తెలంగాణ క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన కైరంకొండ శరత్చంద్ర అండర్ –14 ఫుట్బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపినందుకు శివసేనారెడ్డి గురువారం హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో అభినందించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో పాటు చదువుపై కూడా దృష్టిసారించాలని సూచించారు. క్రీడలు, చదువు భవిష్యత్తును బంగారుమయం చేస్తాయన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గాంధారి(ఎల్లారెడ్డి): చద్మల్, చద్మల్ తండా, నాగ్లూర్ తండా, నేరల్, నేరల్ తండాలో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి తహసీల్దార్ రేణుక చౌహాన్తో కలిసి చెక్కులు అందజేసినట్లు ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, నాయకులు తూర్పు రాజు, సంగని బాబా, అహ్మద్, ముకుంద్రావు, సింగసాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని గురువారం హైదరాబాద్లో నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్కు వివరించినట్లు జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్రెడ్డి తెలిపారు. వీఆర్వో సీనియారిటీకి సంబంధించి విధివిధానాలు లేనందున ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. సంక్షేమ వసతి గృహాల సమస్యలు, కొత్త మున్సిపాలటీల్లో హెచ్ఆర్ఏ పెంపు, వైద్య బిల్లుల రీయింబర్స్మెంట్ బకాయిలు, ఖాళీల భర్తీ అంశాలను వివరించానన్నారు. జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, సంయుక్త కార్యదర్శి అబ్దుల్ ఖాదీర్ పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రేమ వ్యవహారంలో బెదిరింపులు: యువకుడి ఆత్మహత్య


శ్రీకాంత్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఒంటర్పల్లి గ్రామంలో ఓ యువకుడు ఓ యువతిని ప్రేమించగా, విషయం తెలిసిన యువతి కుటుంబ సభ్యులు బెదిరింపులకు పాల్పడటంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన రాపర్తి సాయిలు–అంజవ్వ దంపతులకు ఓ కూతురు, కొడుకు శ్రీకాంత్(21) ఉన్నారు. వారం రోజుల క్రితం కూతురును తీసుకొని దంపతులిద్దరూ హైదరాబాదుకు బతుకుదెరువు కోసం వెళ్లారు. కొడుకు ఒక్కడే ఒంటర్పల్లిలో నివాసం ఉంటున్నాడు. శ్రీకాంత్ అదే గ్రామానికి చెందిన ఓ యువతి గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలిసిన యువతి మామ శ్రీకాంత్పై బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి శ్రీకాంత్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తన కొడుకు ఆత్మహత్యకు కారణం యువతి కుటుంబ సభ్యులే అని శ్రీకాంత్ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. గ్రామానికి ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్సై వెంకట్రావు, పోలీసులు చేరుకొని ఇరువర్గాల వారిని సముదాయించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడి వీరంగం


ధ్వంసమైన బైక్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయ్యపల్లి తండాకు చెందిన దేవసోత్ సంతోష్ అనే యువకుడు మతిస్థిమితం కోల్పోయి గత కొద్ది రోజులుగా తండాలో వీరంగం సృష్టిస్తున్నాడు. ఈక్రమంలో గు రువారం అతడికి ఎదురువచ్చిన తండావాసులను రాళ్లతో, కర్రలతో కొడుతూ అసభ్యకరమైన మాటల తో దూషించాడు. తండాకు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో కి చొరబడి ఫర్నిచర్, టీవీ, వంటపాత్రలు, రెండు బైక్లను ధ్వంసం చేశాడు. దీంతో సుమారు రూ. 2లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలి పారు. సంతోష్ చేష్టలతో విసిగిపోయిన తండావాసులు అతడిని బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీస్ స్టేషన్ లో సైతం రాళ్లు రువ్వుతూ అతడు దాడి చేశాడు. వెంటనే సీఐ రవీందర్నాయక్ ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను పిలిపించి మత్తు ఇంజక్షన్ ఇప్పించారు. గంట తర్వాత సంతోష్ అరవడం మానేశాడు. అనంతరం వైద్య చికిత్సల నిమిత్తం అతడిని ప్రత్యేక వాహనంలో హైదరాబాద్కు తరలించారు.

బాబాయ్ మృతితో కుంగిపోయి..

సంతోష్ వింత చేష్టలతో ఎల్లారెడ్డి సీఐ అతడిపై ఆరా తీశారు. సంతోష్ బాబాయి అయిన దేవసోత్ పకీరాను గత నెల 24న కన్న కొడుకు ప్రకాష్ గొడ్డలితో నరికి చంపాడు. పకీరా మృతి చెందిన సమయంలో అక్కడే ఉన్న సంతోష్ ఇంట్లో పడిన రక్తాన్ని తొలగించి శుభ్రం చేశాడు. అప్పటి నుంచి సంతోష్ మానసికంగా కుంగిపోయి మతిస్థిమితం కోల్పోయినట్లు తండావాసులు తెలిపారు. మంచి భవిష్యత్ ఉన్న యువకుడు మతిస్థిమితం కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు.